క్లుప్తంగా

పవిత్ర నదులకు హారతులు



పవిత్ర నదులకు హారతులు ఇస్తున్న కాశీ నుంచి వచ్చిన పండితులు

నిడమర్రు: క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని మంగళవారం మందలపర్రు పంచాయతన క్షేత్రంలో ప్రత్యేక తులసి పూజలు, కాశీ నుంచి వచ్చిన పండితులతో ప్రత్యేక హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఉమాదేవికి నవ హారతులు ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలోని కొలను వద్ద పుణ్య నదులను ప్రార్థిస్తూ ప్రత్యేక హారతులు ఇచ్చారు.

క్రీడల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

నిడమర్రు: తాడేపల్లిగుడెం లైన్స్ స్పిరిట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదనింద్రకొలను జెడ్పీ స్కూల్లో వివిధ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, చదరంగం వంటి వివిధ పోటీల్లోని విజేతలకు పాఠశాల వద్దే విభాగాల వారీగా జ్ఞాపికలు అందించారు. క్లబ్ అధ్యక్షుడు శ్యామ్, జూనియర్ ప్రోగ్రామర్ వంశీ. మాజీ అధ్యక్షుడు వీర వెంకయ్య, హెచ్ఎం సత్యనారాయణ ఉన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

దెందులూరు: విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని దెందులూరు ఎంపీడీవో కే శ్రీదేవి అన్నారు. మంగళవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపిక చేసిన 27 మంది వలంటీర్ టీచర్లకు శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. 270 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వలంటీర్లను ఎంపిక చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ శాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నారని అన్నారు. శిక్షణ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ జిల్లా అసిస్టెంట్ అధికారి ఆర్ విజయ్‌కుమార్, దెందులూరు ఏపీఎం సురేష్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఫిషరీస్ ట్రెయినీలకు సర్టిఫికెట్లు అందజేత

ఉంగుటూరు: బాదంపూడి మత్స్య శిక్షణ కేంద్రంలో 134వ బ్యాచ్‌లో శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. 18 మంది విద్యార్థుల్లో 17 మంది ఉత్తీర్ణులయ్యారు. వారందరికీ ధ్రువీకరణ పత్రాలు అధికారులు అందజేశారు. మత్స్య శిక్షణ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఏలు బి.నర్సయ్య, ఎం.భార్గవి, పీడీఏ కె.రవి పాల్గొన్నారు. బాదంపూడి మత్స్య శిక్షణ కేంద్రంలో మూడునెలల కోర్సులో యువతకు శిక్షణనిస్తున్నట్టు వారు తెలిపారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారు ఆక్వా రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు.

పంట చేతికందే వేళ.. వాయు‘గండం’

- రెండు రోజులుగా ఆకాశం మేఘావృతం
- వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల గుండెల్లో గుబులు
- నష్టాలు మిగిల్చిన ఖరీఫ్ సాగు
- ధాన్యాన్ని ఒబ్బిడి చేసేందుకు ఉరుకులు.. పరుగులు

భీమడోలు: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం అన్నదాతల గుండెల్లో గుబులు రేపుతోంది. ఆరుకాలం కష్టించి పండించిన పంట చేతికందే దశలో ఇలాంటి విపత్తుల హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ ఏడాది అధిక వర్షాలు, వరుస తుఫాన్ల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు రోజులుగా అల్ప పీడనం ప్రభావంతో ఆకాశం మేఘావృతమై ఉంది. మూడు రోజుల పాటు పిడుగులు, ఉరుములతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు కంటి మీదు కునుకు కరువైంది. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో 92,669 ఎకరాల్లో 22,881 మంది రైతులు వరి సాగు చేసారు. ముందుగా నాట్లు వేసిన రైతులు దీపావళి తర్వాత సార్వా కోతలు ప్రారంభించారు. ఇప్పటి వరకు 30 నుంచి 40 శాతం వరి కోతలను రైతులు, కౌలు రైతులు యంత్రాల సాయంతో పూర్తి చేశారు. పూర్తిస్థాయిలో వరి కోతలు పూర్తయ్యేందుకు మరో వారం రోజుల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ లోగా అల్ప పీడన ప్రభావంతో వర్షాలు కురిస్తే పిడుగు పడినట్లేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



భీమడోలు వద్ద హైవేపై ఆరబోసిన ధాన్యం

ఎకరాకు రూ.35వేలకు పైగా పెట్టుబడి

సార్వా సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. దీనితో రైతులు వరి నాట్లు, వరి నారుమడులు దెబ్బతిని వేలాది రూపాయలు నష్టపోయారు. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో వరి పంటను రైతులు కంటికి రెప్పలా కాపాడుకున్నారు. దీనితో ఎకరా పొలంలో వరి సాగుకు రూ.35వేలకు పైగా పెట్టుబడి పెరిగింది. దిగుబడి మాత్రం అంతంత మాత్రంగా ఉంది. ఎకరాకు 36 - 38 బస్తాల కన్నా ఎక్కువ దిగుబడి రాని పరిస్థితి. అయితే కౌలు రైతులు భూయాజమానికి కౌలుకు 17 బస్తాలు ధాన్యాన్ని అందిస్తే వారికి మిగిలేది కేవలం 19 బస్తాలు. ఖర్చులు పోను కౌలు రైతుకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు నష్టం వస్తుంది. ఇది ఇలా ఉంటే అల్ప పీడన ప్రభావంతో వరి కోత యంత్రంతో కోయగా వచ్చిన పచ్చి ధాన్యాన్ని పొలం వద్దే దళారులకు విక్రయిస్తే 75 కేజీల బస్తాకు సుమారు రూ.320 నష్టం వస్తుంది.



బరకాలతో ధాన్యాన్ని కప్పి ఉంచిన రైతులు

భీమడోలు సబ్‌డివిజన్ పరిధిలోని వ్యవసాయ భూములు

మండలం	ఎకరాలు
భీమడోలు	15,206
ఉంగుటూరు	28,997
నిడమర్రు	3,543
ద్వారకాతిరుమల	44,903

ప్రభుత్వం ఏ గ్రేడు రకానికి రూ.1,740, కామన్ రకానికి రూ.1,725 ఇస్తుంది. ప్రైవేటు వ్యక్తులు ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో రూ.320 తగ్గించి కొంటున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

అన్నదాతను మోసం చేసిన ప్రభుత్వం

గత ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.13,500 నగదును రైతుల ఖాతాల్లో నేరుగా ఐదేళ్ల పాటు క్రమం తప్పకుండా జమ చేసింది. దీనితో రైతులు పంట సాగుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనుల్లో నిమగ్నమయ్యే వారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో అన్నదాత సుఖీభవ పథకంలో రూ.20వేల అందిస్తామని పేర్కొని, ఈ ఏడాది రైతులకు మొండి చేయి చూపింది. దీనితో ప్రభుత్వం నుంచి సాయం అందక సార్వాలో నష్టాలు రావడంతో రైతులు, కౌలు రైతులు అప్పుల్లో కూరుకుపోయారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతుల ధాన్యాన్ని భద్రపర్చేకునేందుకు అవసరమైన టార్పాయిన్లు, సరైన కల్లాలు లేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు అయినకాడికి ధాన్యం విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు జాతీయరహదారి, రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు.అల్ప పీడన ప్రభావంతో ధాన్యం ఆరబోతకు, వరి కోత పనులకు ఆటంకం కలిగేలా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భీమడోలులో ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు

“

కౌలు రైతులకు మిగిలేది శూన్యం



ఈఏడాది సార్వా సీజన్‌లో కౌలు రైతులు ఎకరాకు రూ.35వేలకు పైగా పెట్టుబడి పెట్టి సాగు చేసారు. వరుసగా భారీ వర్షాల వల్ల దిగుబడులు అంతంతమాత్రంగాఉన్నాయి. 40 బస్తాలకు పైగా దిగుబడి వస్తేనే కౌలు రైతులకు పెట్టుబడి తిరిగివస్తుంది. తక్కువ దిగుబడి కారణంగా కౌలు రైతులకు రూ.8వేల నుంచి రూ.12వేల వరకు నష్టం వస్తుంది. కౌలు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, కౌలు రైతు సంఘం నాయకుడు, పూళ్ల

ఆర్‌బీకేల వద్దనే ధాన్యం విక్రయించాలి



భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో డిసెంబర్ మొదటి వారానికి వరి కోతలు పూర్తవుతాయి. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆలోచించి కోతలు ప్రారంభించుకోవాలి. వరి సాగుదారులు ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల వద్దనే విక్రయించాలి. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు. రైతులను ఇబ్బందులకు గురి చేసిన వారిపై తగు చర్యలు తీసుకుంటాం. వాతావరణ శాఖ నుంచి వచ్చే సూచనలను ఎప్పటికప్పుడు తమ వీఏఏల ద్వారా రైతులకు తెలియజేస్తాం.

– డాక్టర్ పి.ఉషారాజకుమారి, ఏడీఏ, భీమడోలు

విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత

గణపవరం: విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యతనివ్వాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం డిగ్రీ కాలేజీలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీల ప్రారంభ సభలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారికి తగిన అవకాశాలు కల్పిస్తే జాతీయ స్థాయిలో రాణిస్తారని అన్నారు. ప్రభుత్వాలు క్రీడలకు మరింత ప్రోత్సాహాన్ని ఇవ్వాలని కోరారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆదిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా, రాష్ట్రస్థాయి ఆటల పోటీలను నిర్వహించడం వల్ల స్థానిక యువతకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కూసంపూడి సురేంద్ర, తోట శ్రీను, నడింపల్లి శ్రీరామ్, యూనివర్సిటీ పరిశీలకుడు ఫణీంద్ర, సెలెక్షన్ కమిటీ సభ్యుడు జీవీ పవన్, వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పరిధిలోని పలు డిగ్రీ కళాశాలలకు చెందిన టేబుల్ టెన్నిస్ జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. ప్రథమస్థానంలో పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల విద్యార్థులు, ద్వితీయస్థానంలో తణుకు ఎస్‌కేఎస్‌డీ కళాశాల విద్యార్థులు, తృతీయస్థానంలో ఏలూరు సెంయిట్ థెరిస్సా కళాశాల విద్యార్థులు, నాలుగో స్థానం గణపవరం సీహెచ్‌వీపీఎంఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజి విద్యార్థులు నిలిచారు. విజేతలను ప్రిన్సిపల్, అధ్యాపకులు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు.



ఇంటర్ యూనివర్సిటీ టెన్నిస్ పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నిర్మలకుమారి

రేషన్ దుకాణంలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

భీమడోలు: పోలసానిపల్లిలో ప్రభుత్వ రేషన్ షాపు, ఎండీయూ వాహనంపై మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసారు. విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, పౌరసరఫరా విభాగం అధికారులు పోలసానిపల్లి రేషన్ దుకాణాన్ని, ఎండీయూ వాహనంలోని సరుకులను వేర్వేరుగా తనిఖీ చేసారు. బియ్యం, పంచదార నిల్వల్లో వ్యత్యాసం ఉందని గుర్తించారు. ఇందులో ఈ పోస్ లెక్కల ప్రకారం కన్నా 96 కిలోల బియ్యం , 144 కిలోల పంచదార ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. దీనికి బాధ్యులైన రేషన్ డీలర్, ఎండీయూ వాహన ఆపరేటర్‌పై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం 6ఏ కేసు నమోదు చేసారు. అధికంగా నిల్వ ఉన్న సరుకును సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో భీమడోలు సీఎస్‌డీటీ జి.భరత్ కుమార్, వీఆర్వో సాల్మన్‌రాజు, పౌరసరఫరా విభాగం అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



రాయన్నపాలెంలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పెదవేగి : సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, పర్యవేక్షించని అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ కె. వెట్రిసెల్వి హెచ్చరించారు. పెదవేగి మండలం రాయన్నపాలెంలో సీసీ రోడ్డు పనులను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా నిర్మించాలని, పనులను సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలన్నారు. పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్ఈ రమణమూర్తి, డీఈ శ్రీనివాసరావు, ఏఈ మురళి, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



భీమడోలులో సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ

భీమడోలు: పంచాయతీలు ఆర్థిక స్వావలంబనకు చెత్త నుంచి సంపద సృష్టించుకునే స్థాయికి ఎదగాలని జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనూరాధ అన్నారు. భీమడోలు, పోలసానిపల్లి గ్రామాల్లోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో ఇంటింటికీ వెళ్లి పొడి, తడి చెత్తలను హరిత రాయబారులు సేకరించి షెడ్డులో డంప్ చేయడాన్ని ఆమె పరిశీలించారు. పంచాయతీలో ప్లాస్టిక్ వస్తువులను సైతం పొడి చేసే విధానాన్ని పరిశీలించి ఆమె సంతృప్తిని వ్యక్తం చేసారు. తయారీ చేసిన సేంద్రియ ఎరువును ఆమె పరిశీలించారు. పోలసానిపల్లి గ్రామ శివారున ఏర్పాటు చేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డులో డంప్ చేసిన చెత్త సమీపంలోని చెరువులోకి చేరడంపై ఆమె అసంతృప్తిని వ్యక్తం చేసారు. ఈవోఆర్‌డీ ఏ.సుందరి, గ్రామ కార్యదర్శి కేఎల్‌వీ తనూజ, కార్యదర్శి జయరామకృష్ణ, చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్ పాల్గొన్నారు.

అందరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

నిడమర్రు: అందరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చేపట్టిన ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. ఇందులో భాగంగా మండలంలో 270 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. మంగళవారం స్థాని క మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా వయోజన విద్య అధికారుల ఆధ్వర్యంలో అక్షరాస్యతా వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ నాలుగు నెలల కాలంలో అక్షరాస్యతా సిలబస్ ప్రకారం ఎంపిక చేసిన అభ్యాసకులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఎంఆర్పీ బాబూరావు, సీసీలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయకుమారి

నూతన పోస్టల్ ఖాతాల కోసం స్పెషల్ డ్రైవ్

దెందులూరు: అన్ని పోస్టాఫీస్‌లో ఈనెల 15వ తేదీ వరకు ఏపీ పోస్టల్ సర్కిల్ ఆదేశాల మేరకు ఎన్‌పీసీఐ ఆధార్ సీడింగ్‌తో అకౌంట్ ప్రారంభించడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు మెయిల్ ఓవర్సీస్ శ్రీను నాయక్ దెందులూరు పోస్ట్‌మ్యాన్ వై నాగ సురేష్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ సంగీత అన్నారు. మంగళవారం దెందులూరు పోస్టాఫీస్ కార్యాలయంలో వ్యక్తిగత అకౌంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా దెందులూరు పోస్ట్‌మ్యాన్ నాగ సురేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలయ్యే అన్ని పథకాలకు పోస్టల్ ఖాతా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులందరూ వినియోగించుకుని పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరవాలని కోరారు.



పోస్టాఫీసులో నూతన ఖాతాలు ప్రారంభిస్తున్న దృశ్యం

క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ఉంగుటూరు: క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పీఎంపీ అసోషియేషన్ జాతీయ కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించవచ్చన్నారు. మంగళవారం ఉంగుటూరు మండల పీఎంపీ అసోషియన్ ఆధర్వర్యంలో నారాయణపురం అటవీ ప్రాంతంలో వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అసోషియన్ అధ్యక్షుడు కొచ్చెర్ల కోట శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏలూరు జిల్లా కార్యదర్శి జయరాం, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.మరుశీకృష్ణ, గౌరవ అధ్యక్షుడు టి.సత్యనారాయణ, కోశాధికారి పీవీ రాఘవరావు, గోపినాథపట్నం సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి పాల్గొన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో ఉసిరి చెట్టు వద్ద పూజ చేసి అనంతరం ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. క్రీడాపోటీల్లో విజేతలక బహుమతులు అందజేశారు.



నారాయణపురం వన సమారాధన సమావేశంలో మాట్లాడుతున్న బీబీటీ రాజు

వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

గణపవరం: గణపవరం మండలం పిప్పర శివాలయంలో మంగళవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు పూజా ద్రవ్యాలు, ప్రతిమ, స్వామి వారి జెండా, ప్రసాదాలను అందజేశారు. భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం ఈవో పి.త్రిసంధ్యాదేవి, సామాజిక సేవకుడు కొలనువాడ సుబ్బరాజు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేటి తరం నేతలకు మూర్తిరాజు స్ఫూర్తి

నిడమర్రు: నేటి తరం రాజకీయ నాయకులకు మాజీ మంత్రి, గాంధేయవాది చింతలపాటి శ్రీరామచంద్ర మూర్తిరాజు స్ఫూర్తిదాయకమని విశ్రాంత విద్యాశాఖ అధికారి ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం మూర్తిరాజు వర్ధంతి సందర్భంగా జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో పెదనింద్రకొలను మహాత్మా గాంధీ భవనంలో మూర్తిరాజు విగ్రహానికి నాయకులు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు సర్వోదయ సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో జానకిరామరాజు, రఘు, నౌడు అచ్యుతరామారావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణకు శంఖారావం సభ

భీమడోలు: రాష్ట్రంలో హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం జనవరి 5న విజయవాడలో తలపెట్టిన హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా ప్రముఖ్ వంశీ పిలుపు నిచ్చారు. భీమడోలులో మంగళవారం ఉంగుటూరు ఖండ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో హిందూ సంఘాల ప్రతినిధులు, విశ్వహిందూ పరిషత్ పరివార్ క్షేత్రాలు చెందిన వారు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ్ వంశీ మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి హిందువులంతా శంఖారావం సభకు తరలి వచ్చి విజయంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సక్షమ్ ప్రాంత కార్యవర్గ సభ్యులు జగన్నాథం, జిల్లా ప్రచారక్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

నిడమర్రు: బావాయిపాలెంలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు డిమాండ్ చేసారు. మంగళవారం ఆపార్టీ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం భవనం వద్ద సీపీఎం నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ దేవత పుంతలో ముసలమ్మ ప్రాంతంలో నివాస గృహాలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రశూల్‌కి వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో గొర్ల శిరీష, ముత్యాలు దానేశ్వరి, పత్తిన వర్లక్ష్మి, గొర్ల దుర్గ, సీపీఎం నేతలు గవర సత్యనారాయణ, కొన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన్ తదితరులున్నారు.

పాండురంగస్వామి ఆలయంలో పూజలు

ఉంగుటూరు: చేబ్రోలు పాండురంగస్వామి ఆలయం వద్ద 34వ కార్తీక మాస మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 9న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిప్పులగుండం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, పూజలు చేశారు.సాయంత్రం నిప్పులగుండం తొక్కారు. ఆకుల నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

గౌరీదేవికి శాకంబరి అలంకరణ

దెందులూరు: పోతునూరులోని గౌరీదేవిని మహిళలు మంగళవారం 17 రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు. ఈ నెల 16న అమ్మవారి ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

భీమడోలు: పూళ్ల తోట వెంకట్రామయ్య మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పెనుగొండ భువనేశ్వరరావు కోరారు. పూళ్ల ఉన్నత పాఠశాలలో మంగళవారం వారోత్సవాల గోడ పత్రికలను గ్రంథపాలకుడు డీఎస్‌టీ అమర్‌నాథ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాలను హెచ్ఎం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తారన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, చెస్ పోటీలు నిర్వహించి విజేతలకు ఈనెల 20న బహుమతులను అందిస్తామని గ్రంథపాలకుడు తెలిపారు. టీచర్ సీతారామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదపాడు: ఈనెల 14 నుంచి పెదపాడు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు దుగ్గిపోగు జాన్‌బాబు మంగళవారం తెలిపారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో 14వ తేదీన తహసీల్దార్ ఏ కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభిస్తున్నారని చెప్పారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

పెదపాడు: మండలంలోని వట్లూరు, కొక్కిరపాడులో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ 2024-25 రబీ పంటకు సంబంధించి వరికి రూ.500, మొక్కజొన్నకు రూ.483, పెసర, మినుము పంటకు రూ.60 బీమా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. రైతులంతా తప్పనిసరిగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌ఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.